క్లుప్తంగా

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

పగిడ్యాల: ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర సరుకులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ నాగేశ్వరరావు డీలర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా నిర్ణీత గడువులోగా డీడీలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, వీఆర్వోలు నాగన్న, నరసింహ, భగవాన్‌దాస్ తదితరులు ఉన్నారు.

గడ్డివాముల దగ్ధం

పాములపాడు: మండలంలోని కృష్ణానగర్ గ్రామంలో సోమవారం రెండు గడ్డివాములు దగ్ధం కాగా రైతులకు రూ.1.40లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రమణమ్మ లు పశువుల కోసం గ్రాసం కొనుగోలు చేసి కళ్లంలో వాములు ఏర్పాటు చేసుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో నిప్పుపెట్టడంతో గడ్డివాములకు మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు ఆత్మకూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటినా సంఘటనా ప్రాంతానికి చేరుకొని మంటలను అదుపుచేశారు.

పొలం రస్తా పరిశీలన



రస్తాను పరిశీలిస్తున్న జేసీ

మహానంది: మహానంది సమీపంలోని 236 సర్వే నంబర్ పొలంలో రస్తా విషయాన్ని పరిశీలించేందుకు నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సోమవారం మహానందికి వచ్చారు. ఈ మేరకు మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డిలతో కలిసి పొలం వద్ద రికార్డులు పరిశీలించారు. పొలం యజమాని జయరాం నాయుడు పొలానికి దారి లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే సంబంధిత పొలం వద్ద మహానంది దేవస్థానానికి చెందిన భూములు ఉన్నాయి. అనంతరం మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధానిలు స్వాగతం పలికారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్: మండలంలో నీటి సమస్య పరిష్కారానికి నూతన పైపులైన్ల ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని బీసీ కాలనీలో నూతన పైపులైన్ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. సర్పంచ్ మరియమ్మ, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి, ఉప సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీలు సురేష్, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


నంద్యాలకు తిరుగుపయనమైన పెళ్లిపెద్దలు



నంద్యాలకు వెళుతున్న స్వామి, అమ్మ వార్లు

మహానంది: మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెళ్లి పెద్దలుగా వచ్చిన శ్రీ పార్వతీ సమేత శ్రీ బ్రహ్మనందీశ్వరస్వామి వార్లు ఉత్సవాలు పూర్తయిన నేపథ్యంలో సోమవారం తిరిగి నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, రుత్వికుల బృందం ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక రుద్రగుండం కోనేరులో త్రిశూల స్నానం అనంతరం స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మేళతాళాల మధ్య గ్రామోత్సవంగా నంద్యాలకు తరలివెళ్లారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం



డి.పెద్దిరాజు, శ్రీశైలం ఈఓ

శ్రీశైలంటెంపుల్: జిల్లా అధికారుల సమన్వయంతో శ్రీశైల మహాక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగాయని దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయన్నారు. బ్రహ్మోత్సవ 11 రోజుల్లో సుమారు 10 లక్షల మంది భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారని తెలిపారు. శ్రీశైలక్షేత్రాన్ని జోన్లవారీగా విభజించి.. పర్యవేక్షణను ఉన్నతాధికారులకు అప్పగించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.



5వ వార్డులోని ఓ వీధిలో క్యూరింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు



27వ వార్డులో క్యూరింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేస్తున్న దృశ్యం



7వ వార్డులో వేసిన సీసీ రోడ్డు



12వ వార్డు ప్రధాన రహదారిలో పూర్తయిన సీసీ రహదారి

సందు సందులో సీసీ రోడ్డు

- బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చొరవతో గ్రేడ్–2 మున్సిపాలిటీగా నందికొట్కూరు
- ప్రభుత్వ నిధులు రూ.50.68 కోట్లతో 351 పనులు
- ప్రతి వార్డులో సీసీ రోడ్ల నిర్మాణాలు
- వేగంగా సాగుతున్న పనులు



5వ వార్డులో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు విడుదల చేయించడంతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏ వీధిలో చూసినా సీసీరోడ్లే దర్శన మిస్తున్నాయి.



గ్రేడ్–2 మున్సిపాలిటీగా నందికొట్కూరు

ప్రస్తుతం పట్టణం 23.85 చదరపు కిలో మీటర్లు విస్తరించి ఉంది. పట్టణంలో ఎన్నికల వార్డులు–29, రెవెన్యూ వార్డులు–16 ఉన్నాయి. ఓట్లు మొత్తం–33,817 ఉన్నాయి. జనాభా సుమారు 65 వేల వరకు ఉంది. గ్రేడ్ –3 మున్సిపాలిటీగా ఉన్న నందికొట్కూరును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రత్యేక చొరవతీసుకోవడంతో 2020 సెప్టెంబర్‌లో గ్రేడ్–2 మున్సిపాలిటీగా మారింది.

ప్రత్యేక నిధుల మంజూరు

నందికొట్కూరు పట్టణానికి నందనవనంగా తీర్చిదిద్దాలని సంకల్పంతోనే 351 వర్కులకు గాను రూ.50.68 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గడప గడపకు మన ప్రభుత్వం నిధుల కింద రూ.2.80 కోట్లతో 51 వర్కులు, ప్రత్యేక నిధులు రూ.15. 34 కోట్లతో 115 వర్కులు జగనన్న ప్రభుత్వ మంజూరు చేసింది. మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణానికి రూ.3. 24 కోట్లు, ఏబీఎం పాలెంలో కుడా కింద నిర్మించిన జైభీమ్ పార్కు రూ.40 లక్షలు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసిన విషయం అందరికీ తెలిసిందే. 14వ ఆర్థిక, 15వ ఆర్థిక నిధులు, జనరల్ ఫండ్ కలిపి రూ. 29.10 కోట్ల నిధులతో పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేస్తున్నారు. దీంతో పట్టణంలో మట్టిరోడ్లు కనుమరుగయ్యాయి.

90 శాతం పనులు పూర్తయ్యాయి



పట్టణాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రూ, 15.34 కోట్లు మంజూరు చేయించి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు 90 శాతం పూర్తి చేయించాం. మిగతా 10 శాతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వారం రోజులలో పూర్తి చేస్తాం. ప్రభుత్వ నిధులు మొత్తం కలిపి రూ.50. 68 కోట్ల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేశాం. నందికొట్కూరు పట్టణాన్ని నందనవనంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయం. గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి చేసి చూపించాం.

– శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నిర్మాణాలు త్వరలో పూర్తి

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు సుమారు 90 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులు త్వరలోనే పూర్తి చేస్తాం. ఇక పట్టణంలో మట్టి రోడ్లు అసలు కనిపించవు.

– సుధాకర్‌రెడ్డి, కమిషనర్ నందికొట్కూరు

ప్రసూతి సహాయం అందజేతపై సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అసిస్టెంటు లేబర్ కమిషనర్ సీతాలక్ష్మి

జూపాడుబంగ్లా: 2018–19, 2019–20 రెండేళ్ల కాలానికి కార్మికులకు అందజేసిన ప్రసూతి ఆర్థిక సహాయంపై సోమవారం వైకేపీ కార్యాలయం వద్ద అసిస్టెంటు లేబర్ కమిషనర్ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2019, 2020 సంవత్సరాల్లో మండలం పరిధిలో భవననిర్మాణ కార్మికులుగా గుర్తింపు పొందిన 25మందికి ఒక్కొక్క కాన్పుకు రూ.20వేల చొప్పున రెండు కాన్పులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మంజూరైన నిధులు అర్హులైన వారికి అందాయా లేదా అనే విషయమై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. సోషల్‌ఆడిట్‌లో లబ్ధిదారులను విచారించగా అందరికీ సక్రమంగా ప్రసూతి నిధులు అందినట్లు వెల్లడైందన్నారు. కార్యక్రమండలో ఎంపీడీఓ నూర్జహాన్, ఎస్సార్పీ కన్నారెడ్డి, డీఆర్పీ బాదులయ్య, నందికొట్కూరు అసిస్టెంటు లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఏపీఓ గౌరీబాయి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని చెరుకుచర్ల గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తి మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. సోమవారం 60 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా తనిఖీ చేసి పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

దళిత పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయి
- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి , వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్



అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్

నందికొట్కూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతిగా నిలిచారని ఏపీ శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీఆర్ గార్డెన్‌లో మాలమహానాడు నాయకులు యాట ఓబులన్న అధ్యక్షతన జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథులుగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ హాజరయ్యారు. ముందుగా వారు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. మాలలంతా వైఎస్సార్‌సీపీ వెంటే నడవాలని కోరారు. సంక్షేమ పథకాలే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రిని చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో టీడీపీకి దళితులు గట్టిగా బుద్ధిచెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లాలు ప్రసాద్, చెరుకు సురేష్, సర్పంచులు పెరుమాళ్ల శేషన్న, ఏలీషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బతి రవికుమార్, రమేష్, ఏసురత్నం, మాలమహానాడు నాయకులు డాక్టర్ వెంకటేష్, ఆర్‌ఎం ఎర్రన్న జయరాం, నాగేషులు, దేవదాసు, సంసోన్, జగదీష్, శీలం ముని, నక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సీట్లను అమ్మేందుకు చంద్రబాబు వేలంపాటలు

తెలుగు దేశం పార్టీ తరుపున పోటీ చేసేందుకు ఎవరూ సుముఖత చూపకపోవడంతో చంద్రబాబు నాయుడు వేలంపాటలు వేసినా ఎవరూ ముందుకు రావడం లేదని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శివశంకర్ టాకీస్ సమీపంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సర్వమత ప్రార్థనల మధ్య డాక్టర్ దారా సుధీర్‌తో కలసి ప్రారంభించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డబ్బుల తూకం ఎటువైపు ఉంటే అటు వైపు మొగ్గు చూపేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు తహతహలాతుంటే.. ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు వెళ్లకపోవడంతో దిక్కుతోచ్చక జనసేన, బీజేపీతో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. బలమైన నాయకత్వం లేకపోవడంతోనే తెలుగు దేశం పార్టీ కనుమరుగైందని గుర్తు చేశారు. పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ షేక్ రహత్, ఎంపీపీలు మురళీకృష్ణారెడ్డి, సువర్ణమ్మ, జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు మద్దూరు సతీష్‌రెడ్డి, మహేశ్వరెడ్డి, తులసిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్

స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నాపత్రాలు

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పది పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరచినట్లు పరీక్షల నిర్వహణ అధికారులు సాయి తిమ్మయ్య, మల్లికార్జున నాయక్, భరత్ భూషన్ సోమవారం తెలిపారు. పదో తరగతి సెట్ –2 ప్రశాపత్రాలను మిడుతూరు ఎంఈఓ, రూట్ ఆఫీసర్ రామిరెడ్డి, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెలుగు, హిందీ, ఆంగ్లం , సైన్సు పేపర్–1, సైన్సు పేపర్–2, సోషియల్ ప్రశ్నా పత్రాలు వచ్చినట్లు తెలిపారు. సెట్ –1 ప్రశ్నాపత్రాలు ఆదివారం స్టేషన్‌కు చేరినట్లు వెల్లడించారు.

సర్వేలు త్వరగా పూర్తి చేయండి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేతో పాటు ఇతర సర్వేలను గ్రామవలంటీర్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ జవహర్ బాబు సూచించారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 10,616 కుటుంబాలు ఉండగా వలంటీర్లు 10,000 కుటుంబాల కులగణన సర్వే నిర్వహించి 94 శాతం పూర్తి చేశారన్నారు.

గుంతకందాలలో పట్టుకోల్పోయిన టీడీపీ

- 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ పట్టుకోల్పోయింది. 2019 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలోనూ అన్ని స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఇన్నాళ్లు గ్రామంలో నామమాత్రంగానే ఉన్న టీడీపీ.. తాజాగా 150 కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరడంతో నామరూపాలు లేకుండా పోయింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మేలు శివయ్య, శివన్న, డీలర్ శ్రీను, అడపాల శివుడు, వాడాలా శ్రీను, వెంకటరమణ, సుధాకర్ నాయక్‌ల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో 150 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మహబూబ్‌బాషా, సయ్యద్, చిన్న హుస్సేన్‌సా, ఎంఎండీ రఫీ, వడ్డే గురుస్వామి, పెద్దస్వామి, జంగాల బొక్కప్ప, హుస్సేన్‌బాషా, నాగూర్‌బాషా, షేక్ జమాల్‌బాషా, సుగాలి నాగరాజు నాయక్, కృష్ణస్వామితో కలిపి 150 కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరికి కండువాలు కప్పి శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు ఆకర్షితులైన స్వచ్ఛందంగా ఊర్లకు ఊర్లు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాయని తెలిపారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామని, మా మద్దతు ఫ్యాన్ గుర్తుకే అని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఘన స్వాగతం పలికి, గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకోవాలి



ముస్లిం సోదరుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న డాక్టర్ దారా సుధీర్

కొత్తపల్లి: పేద ప్రజలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దారా సుధీర్ అన్నారు. సోమవారం మండలంలోని దుద్యాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ పరిచయ కార్యక్రమం చేపట్టారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై మీ అమూల్యమైన ఓటువేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్ధన్‌రెడ్డి, మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ నాగ ఎల్లయ్య, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మొద్దు





రేగడగూడురులో మంచినీటి కుళాయిని ప్రారంభించి మహిళకు బిందెను అందిస్తున్న ఎంపీ పోచా, బాపనంతపురంలో గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వెలుగోడు మండలంలో పలు అభివద్ధి పనుల ప్రారంభం

వెలుగోడు: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలో పలు అభివృద్ధి పనులను నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రారంభించారు.

➡ వేల్పనూరు గ్రామంలో రూ.75 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ గోదామును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. – రేగడగూడూరు ఎస్సీ, బీసీ కాలనీల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న నీటి సమస్యను ఎమ్మెల్యే చొరవ తీసుకొని పరిష్కరించారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ. 36 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైను ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు.

➡ రేగడగూడూరులో నూతనంగా రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, రూ.75 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోదామును ప్రారంభించారు.

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

వెలుగోడు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సెంటున్నర స్థలం ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వెలుగోడు మండల, పట్టణ వాసులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడమే కాకుండా వారికి మన ప్రభుత్వం ద్వారా పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నామన్నారు.

ఎన్నడూలేని అభివృద్ధి

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరిగిందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే శిల్పా నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి అభినందనీయమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను, ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణి రెడ్డి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సింగిల్ విండో చైర్మన్ బన్నూరు అంకిరెడ్డి, ఎంపీటీసీలు బన్నూరు తోయ జనాభారెడ్డి, పల్లె వెంకట్రామిరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, కో–ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ నందిరెడ్డిగారి వెంకటేశ్వరమ్మ, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ అంబాల లక్ష్మి సావిత్రమ్మ, వెలుగోడు సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ

ఆత్మకూరు: రైతుల ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని కురుకుందలో రూ.74లక్షలు, బాపనంతపురంలో రూ.40లక్షలతో నిర్మించిన నూతన గోదాములను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారని, ప్రధానంగా రైతులకు పంటలు నష్టపోయినప్పుడు పంట నష్టపరిహారం, ఇన్సురెన్స్, రైతు బీమా కల్పించారన్నారు. అన్ని గ్రామాల్లో నూతన వ్యవసాయ గోదాములు నిర్మించడం వల్ల రైతులు పండించిన పంటలను గోదాముల్లో దాచుకొని ఎప్పుడైనా ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం గోదాము నిర్మించలేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, మాబాషా, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ అబ్దుల్ కాలం, సర్పంచ్ మహబూబ్‌బీ, రాజేష్, విజయచౌదరి, పువ్వాడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో సోమవారం రాత్రి బీఎస్‌ఎఫ్ స్పెషల్ ఫోర్స్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో బ్యానర్లు, రాజకీయ ప్రచారాలను ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐలు నాగభూషణం, లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు నారాయణరెడ్డి, హరి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాలూకా కమిటీ ఎన్నిక

ఆత్మకూరు: స్థానిక అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు మల్లె ఎలిషా, రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఆ సంఘం తాలూకా కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతలయ్య, సహాయ ఉపాధ్యక్షులుగా రవికుమార్, అధ్యక్షులుగా చెన్నకేశవులు, చెన్నయ్య, బీమార్జున, అబ్రహం, ప్రధాన కార్యదర్శులుగా భాస్కర్, మల్లయ్య ఎన్నికయ్యారు.

మహిళకు వీల్‌చైర్ అందజేత

నందికొట్కూరు: పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ పర్వీన్‌కు ఐదేళ్ల క్రితం పక్షపాతం వ్యాధి సోకింది. మంచానికే పరిమతమైన పేద మహిళకు శ్రీరామ, శ్రీకృష్ణ సినిమా థియేటర్ యాజమాని రామిరెడ్డి రూ.10 వేలు విలువ చేసే వీల్‌చైర్‌ను సోమవారం అందజేసి మానవత్వం చాటుకున్నారు. వీల్ చైర్ దాతను వార్డు కౌన్సిలరు మందడి వాణి, ప్రజలు అభినందించారు. నాయకులు రవీంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.